# ప్రసాది రాజ్యం



జయంతి కాళీ అన్నపూర్ణ

సమయం పది గంటలు అయింది.

సుమలత భర్తను ఆఫీసుకు, పిల్లల్ని స్కూలుకు పంపి సోఫాలో కూలబడింది. సుమలత మనసు సంతోషంతో పురి విప్పిన నెమలిలా నాట్యం చేస్తోంది. అందుకు కారణం ముందురోజు జరిగిన సంఘటన.

* * *

శ్రీధర్ ఆఫీసు నుండి వస్తూనే హుషారుగా కుటుంబ సభ్యులను సమావేశపరిచి "ఈరోజు మీ కందరికీ శుభవార్త!" అన్నాడు మందహాసంతో. 'ఏమయి వుంటుందా?!' అని అందరూ ఆశ్చర్యంతో, ఆత్రుతతో శ్రీధర్ చెప్పే విషయంకోసం ఎదురుచూస్తున్నారు.

"ఈరోజు నాకు బోనస్ రెండువేల రూపాయలు యిచ్చారు. దానితో మనం అవసరమయిన వస్తువును కొనబోతున్నాం. ఏది కొంటే బాగుంటుందో చెప్పండి చూద్దాం!"

"టేప్‌రికార్డర్ కొందాం డాడీ" అన్నాడు పన్నెండేళ్ళ రవి వుత్సాహంగా.

"డ్రెస్సింగ్ టేబుల్ కొందాం డాడీ" అన్నది పదహారేళ్ళ కవిత తన్మయత్వంగా.

"శ్రీమతిగారి కలవేమిటో!!"

"నా అభిప్రాయం ఏమిటంటే అందరికీ వుపయోగించేది యింట్లో వుండదగినది 'బీరువా' అయితే బాగుంటుంది!" అన్నది సుమలత చిరునవ్వుతో.

"మైడియర్ రవి అండ్ కవిత! మరొక్కసారి మమ్మీ ప్రపోజల్ గురించి ఆలోచించండి!"

'మమ్మీ అయిడియా బాగానే వుంది. ఎంచక్కా తన బట్టలు, పేంట్లు, షర్టులు నలిగిపోకుండా హేంగర్స్‌కి తగుల్చుకుని బీరువాలో పెట్టుకోవచ్చు. హేంగర్స్‌కి పెట్టుకునేలా వుండే మోడలు కొనమనాలి' అనుకున్నాడు రవి.

'మమ్మీ అయిడియా బాగానే వుంది. తన ఫ్రెండ్స్ అందరి ఇళ్ళలోను బీరువాలు వున్నాయి. మన ఇంట్లోనే లేదు. దానికే పెద్ద మిర్రర్ ఫిక్స్ చేయించమని డాడీతో చెప్పాలి. రోజూ తన రూపాన్ని తనివితీరా చూసుకోవచ్చు' అనుకున్నది కవిత.

"డాడీ, మమ్మీ చెప్పింది బాగుంది బీరువాయే కొందాం!" అని ఇద్దరూ ఒకేసారి వారి సమ్మతిని తెలియచేశారు ఆనందంగా.

"ఓ.కే ఐతే ఏరంగు బాగుంటుంది?"

అందరూ తర్జనభర్జనలు జరిపి చందనం రంగుది అయితే బాగుంటుంది అని నిశ్చయించారు.

"అయితే రేపు సాయంత్రానికి బీరువా వచ్చేస్తుంది" అన్నాడు శ్రీధర్.

* * *

మధ్య తరగతి కుటుంబంలో చిన్న కోరిక తీరడం అంటే వైకుంఠపాళిలో పెద్దపామును దాటినట్లే అనుకుంటూ! ఎన్నాళ్ళ నుండో అనుకుంటున్నది ఈనాటికి బీరువా వస్తుంది. ఎన్నిసార్లో డబ్బు కూడబెట్టడం ఏదో అవాంతరం రావటం అనుకున్నదానికి ఆటంకం కలగటం కోరికలు తాత్కాలికమవటం.

'బీరువా వస్తే అది ఎక్కడ పెడితే బాగుంటుందా' అన్న ఆలోచనలో పడింది సుమలత.

ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ 'పోస్టు' అన్న కేక వినబడింది.

కవరు విప్పి చదవనారంభించింది.

"చి॥ శ్రీధర్‌కు,

మీ నాన్న ఆశీర్వదించి వ్రాయునది, అచ్చట నీవు, చిరంజీవులు, కోడలు కులాసా అని తలుస్తాను. ఈ మధ్య నీ వద్దనుండి వుత్తరములు లేవు. ఇచ్చట మేము ఏదో కాలక్షేపం చేయుచున్నాము. ఈ మధ్య మీ అమ్మకు కొంచెం అనారోగ్యం చేసింది. డాక్టరుకు చూపించాను. కడుపులో అల్సరు అయిందని, ఆపరేషను చేయించాలని చెప్పారు. దానికి కనీసం మూడువేల రూపాయలు దగ్గర పెట్టుకోవాలి. ఇచ్చట అప్పుకోసం చాలా విధాల ప్రయత్నం చేశాను. కాని ప్రయత్నం విఫలమైంది. నీవు ఆపరేషను టైముకు దగ్గర వుండాలని మీ అమ్మ కోరిక. నీకు డబ్బు గురించి

వ్రాయడం మీ అమ్మకు ఇష్టం లేదు. 'డబ్బుకోసం వాడ్ని బాధపెట్టకండి, నా ఆపరేషన్ అంత ముఖ్యం కాదు' అని అంటోంది కాని నాకు తోడుకావాలి కదా మరి. అందువల్ల నేను ఆపరేషను చేయించటానికే నిర్ణయించుకున్నాము. నీవు సొమ్ము కొంత అయినా సర్దుబాటు చెయ్యాలి. బ్రతికివుంటే బలుసు ఆకు అయినా తిని వుండవచ్చు. నీవు మరోలా భావించక సొమ్మును సర్దుబాటు చేసుకుని ఒక వారం రోజులలో రా. నీకోసం కంట్లో వత్తులు వేసుకు ఎదురుచూస్తూ వుంటా. కోడలిని మరీ మరీ అడిగినట్లు చెప్పుము. చిరంజీవులకు నా ఆశీస్సులు.

ఇట్లు

నీ తండ్రి రామశాస్త్రి."

ఉత్తరం చదివిన సుమలతకు సంతోషమంతా చప్పగా చల్లారిపోయింది యిప్పుడు ఏమి చెయ్యాలి? కర్తవ్య మేమిటి? అన్న ఆలోచనలో పడింది.

'పోనీ ఒకపనిచేస్తే? శ్రీవారు రాగానే ఈ వుత్తరం చూపించకుండా ఈరోజుకు దాచేస్తే, ఈరోజు బీరువా కొనటం అయిపోతుంది. ఆ తర్వాత ఎదో తంటాలు పడతారు' అనుకుంది సుమలతలోని ఆడ మనసు.

'కాని ఎందుకో మనస్సు ఎదురు తిరుగుతోంది. తప్పుపని చేస్తున్న భావన కలుగుతోంది. భగవాన్ ఏమిటయ్యా నీ లీల. ఇప్పుడు ఏం చెయ్యాలి? ఛ! ఒక్కడే కొడుకు కావడంవల్ల బాధ్యత అంతా తమనెత్తి మీదనే పడింది.'

'ఛ! ఏమిటి తన మనస్సు ఇంత వక్రంగా ఆలోచిస్తోంది. ఇలాగే తన తల్లికి జరిగివుంటే తన వదిన ఇలా చేస్తే ఏమవుతుంది?'

'నో! నో! అలా జరగటానికి వీల్లేదు. ఆ విషయం తన తల్లిదికాదు కాబట్టా!!'

'ఛ! ఇలాంటి సమస్య పగవాళ్ళకు కూడా వద్దు, శ్రీవారు రాగానే ఉత్తరం చూపిస్తాను. వారు ఏ నిర్ణయం తీసుకుంటారో చూద్దాం' అనుకుని వంటగది లోకి నడిచింది.

* * *

సాయంత్రం శ్రీధర్, రవి, కవిత ఎంతో ఆనందంగా ఇంట్లో అడుగు పెట్టారు.

సుమలత మొహంలో దిగులు.

"కాఫీ, టిఫిన్ రెడీయేనా? త్వరగా పెట్టేస్తే, తినేసి బజారు వెళ్ళి బీరువా తెచ్చేస్తాను."

పిల్లలు త్వరగా టిఫిన్ పెట్టమని తొందర చేశారు

సుమలతకు విషయం ఎలా చెప్పాలో తెలియటం లేదు. ఇంత ఉత్సాహంగా వున్నవాళ్ళను నిరుత్సాహపరచటానికి మనసు రావటంలేదు. మౌనంగా భర్తకు, పిల్లలకు టిఫిన్ పెట్టింది.

శ్రీధర్ టిఫిన్ తినేసి, కాఫీ తాగి ఈలవేసుకుంటూ సొమ్ము తీసుకుందుకు

పెట్టివేపు వెళ్ళాడు.

"ఏమండీ ఒకసారి ఇటురండి. మీకు వుత్తరం వచ్చింది మీ నాన్నగారి వద్ద నుండి" అని ఉత్తరం అందించింది.

ఉత్తరం చదివాడు శ్రీధర్.

అది విన్న అందరి ముఖాలు పాలిపోయాయి.

ముందుగా సుమలత తేరుకుని "పోన్లెండి. టీరువా ఇంకొకసారి కొనుక్కోవచ్చు ముందు మీ అమ్మగారి ఆపరేషను సంగతి ఆలోచించండి. డబ్బు సంపాదించుకోవచ్చు కాని మనుష్యులను సంపాదించుకోలేము కదా!" అన్నది.

సుమలత వివేకానికి శ్రీధర్ మనస్సు ఆనందంతో నిండింది.

రవి, కవిత డిజప్పాయింట్ అయ్యారు. వారి దృష్టిలో మమ్మీ డాడీకి వుత్తరం చూపించినందువల్ల టీరువా కొనటానికి ఆటంకం కల్గింది.

"ఛ! నాయనమ్మకి ఇప్పుడే జబ్బు రావాలా? మనం సుఖపడ్డం ఇష్టంలేదు కాబోలు. అమ్మది మరీ చాదస్తం" అంటున్నాడు రవి- కవితతో.

"అమ్మకు అసలు బుద్ధిలేదు. నేనయితే ఏం చేసేదాన్నో తెలుసా! టీరువా కొనుక్కునేదాకా ఉత్తరం సంగతి బైట పెట్టేదాన్ని కాదు" అంటోంది కవిత రవితో.

"షటప్ రవీ" అంది సుమలత భద్రకాళిలా.

"ఒరే రవీ! ఇంతేరా నీ ఆలోచన. రేపు నాకు ఇదే పరిస్థితి వచ్చి, నీ కొడుకు ఇలాగే అంటే నా గతి ఏమవుతుందిరా?! ఇదేనా సంస్కారం. చదువుకున్నందుకు ప్రయోజనం."

"మేము మిమ్మల్ని ఎంత ప్రేమగా పెంచుతున్నామో. మీ తాతయ్య, మామ్మ కూడా మీ నాన్నను అంత అల్లారుముద్దుగా పెంచారురా. నువ్వు ఏది చేస్తే నీ పిల్లలు కూడా అదే చేస్తారురా. అలాంటప్పుడు మనుషుల్లో మానవత్వం నశించిపోతుందిరా. అలా జరుగుతే కన్న తల్లిదండ్రులు ఎంత క్షోభపడతారో నీకేం తెలుసురా?!"

"అమ్మా కవితా! నీవు పొరబాటు పడుతున్నావమ్మా. అమ్మకు చాదస్తం అనుకుంటున్నావే కాని, అమ్మకు ఇలాగే జరుగుతే ఎలా వుంటుందో ఆలోచించావా? అమ్మయినా, అత్తయినా ఒకటేనమ్మా. మనల్ని చూసే మన బిడ్డలు సంస్కారవంతు లవుతారమ్మా."

"నీకు ఇప్పుడు చిన్నతనం కావచ్చు. డబ్బు కాదమ్మా శాశ్వతం! మనసున్న మనుషులు దొరకడం కష్టం తల్లీ. నీకు అమ్మ వుంది, రేపు అత్తగారు వస్తారు. నువ్వు తల్లివి అవుతావు. నువ్వే అత్తవూ అవుతావు. నీకూ ఈ పరిస్థితి రావచ్చు. దైవనిర్ణయం ఎలా వున్నా మనసున్న మనుషులుగా ప్రవర్తించాలమ్మా. దానికి మీ తరంవాళ్ళు మా తరం వాళ్ళను ఆదర్శంగా తీసుకోవాలి మరెప్పుడూ ఇలా ఆలోచించకమ్మా" అన్నది




సుమలత, కుమార్తె చెయ్యి పట్టుకుని ఆవేశంగా.

'మమ్మీ చెప్పింది కరెక్టే. ఏమిటో అంత ఆలోచన చేయలేకపోయాము. తల్లీ పిల్లల సంబంధం అందరిదీ ఒక్కలాంటిదే. తల్లి ప్రేమ డబ్బుతో కొనలేనిది, వెలలేనిది అనుకున్నారు' రవి, కవిత.

"మమ్మీ సారీ" అన్నారు కోరస్‌గా రవి, కవిత.

"నడవండి. ఈ రోజే బయలుదేరి వెళదాం. అత్తయ్యను బ్రతికించుకుందాం" అంది సుమలత.

ముందు తరంవారి సంస్కారానికి ఈ తరంవాళ్ళు పునాదిరాళ్ళు కావాలి అనుకున్నాడు శ్రీధర్. *